క్లుప్తంగా

తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



సూపరింటెండెంట్ నవీన్‌కుమార్

అమలాపురం టౌన్: తపాలా శాఖ అందించే సేవలను ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని అమలాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారంతో ముగిసిన తపాలా వారోత్సవాలకు సంబంధించి తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సూపరింటెండెంట్ మాట్లాడారు. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకూ 'ఫర్ పీపుల్ లోకల్ సర్వీస్ గ్లోబల్ రీచ్' నినాదంతో తపాలా వారోత్సవాలు పోస్టల్ డివిజన్‌లో విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా అమలాపురం, రాజోలు, కొత్తపేట, రావులపాలెంలలో దాదాపు రెండు వేల కొత్త తపాలా ఖాతాలను తెరిచినట్లు తెలిపారు. శుక్రవారం అమలాపురం డివిజన్ పోస్టల్ కార్యాలయంలో తపాలా వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని వేడుకలా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నవీన్‌కుమార్‌తోపాటు అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీధరం, పోస్టల్ ఉద్యోగులు, యూనియన్ల నాయకులు, ఖాతాదారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అరుణాచలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

ముమ్మిడివరం: పల్లిపాలెం శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో అపీతకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి, ఇతర దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ పూజ శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదిత్యశర్మ బ్రహ్మత్వంలో పెన్మత్స చిట్టిరాజు దంపతులు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాలికలకు బహుమతుల ప్రదానం

ముమ్మిడివరం: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గురుకుల పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.నిహారిక ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు శుక్రవారం బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా సీడీపీఓ నిహారిక మాట్లాడుతూ బాలికల సామర్థ్యం, వారి హక్కుల కోసం, వివక్ష, హింస వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు, వారి విద్య, ఆరోగ్యం, భద్రత వంటి విషయాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాధ్యాతను వివరించారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కే.వెంకటేశ్వరరావు, జీవీఎస్ఎన్ దేవి, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బిందుశ్రీకి తమిళనాడు సీఎం ట్రోఫీ

యానాం: జార్జిపేటకు చెందిన ఇసుకపట్ల బిందుశ్రీ కెప్టెన్‌గా ఆమె నేతృత్వంలో బృందం బాల్ బ్యాడ్మింటన్‌లో తమిళనాడు సీఎం ట్రోఫీని సాధించి, రూ.7.5లక్షల ప్రైజ్‌మనీని కైవసం చేసుకుంది. ఈ బృందంలో పీఎస్ఎన్ఏ కళాశాల తరపున ప్రాతినిధ్యం వహించిన బిందుశ్రీ బంగారు పతకంతో పాటు నగదు బహుమతిని గెలుచుకున్నారు. గతంలో యానాం బ్యాడ్మింటన్ క్లబ్‌లో శిక్షణ పొందిన బిందుశ్రీ గత నెలలో జరిగిన దిండిగల్ పోటీల్లోనూ విశేష ప్రతిభ కనబరిచి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా అసోషియేషన్ కోచ్ బి.శ్రీనివాసు, అధ్యక్షుడు ఐ.అంబేడ్కర్, పి.అజయ్ తదితరులు బిందుశ్రీని అభినందించారు.

12న 'విలేజ్ అసిస్టెంట్' పరీక్ష

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఖాళీగా ఉన్న విలేజ్ అసిస్టెంట్ అండ్ ఎంటీఎస్ (లీగల్ మెట్రాలజీ) పరీక్ష ఈనెల 12న నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. పరీక్ష నిర్వహించే సిబ్బందికి శుక్రవారం స్థానిక ఆర్ఏఓ ఆఫీసులో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రీజినల్ అడ్వైజర్, రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి చిత్ర ఐఏఎస్ ఆధ్వర్యంలో శిక్షణనిచ్చారు. యానాం నుంచి హాజరవుతున్న 1,917 మంది అభ్యర్థులకు మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రీజినల్ అడ్మినిస్ట్రేటర్ అంకిత్‌కుమార్ తెలిపారు. ఆరోజు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకు పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని స్పష్టం చేశారు. అబ్జర్వర్‌గా ఇషితారథీ, నార్త్ పుదుచ్చేరి కలెక్టర్ వస్తున్నారన్నారు.

వైఎస్సార్ సీపీ మహిళా నేత సుధారాణికి సత్కారం



సుధారాణిని సత్కరించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

అమలాపురం టౌన్: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలిగా నియమితులైన అమలాపురానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ దొంగ నాగ సుధారాణిని పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అభినందించారు. రావులపాలెంలోని క్యాంపు కార్యాలయంలో జగ్గిరెడ్డిని నాగ సుధారాణి మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా సుధారాణిని జగ్గిరెడ్డి అభినందించి, సత్కరించారు. కార్యక్రమంలో అమలాపురం పార్టీ నాయకుడు దొంగ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

మూగ వేదన.. అరణ్య రోదన

- వరదతో పశుగ్రాసానికి ముప్పు
- విలవిల్లాడుతున్న మూగ జీవాలు
- గణనీయంగా తగ్గిన పాల ఉత్పత్తి
- పాడి రైతుల కష్టాలను పట్టించుకోని పాలకులు



లంక భూములు ముంపునకు గురవడంతో రహదారి పక్కన కట్టిన పశువులు

ముమ్మిడివరం: గోదావరికి వరదలు ముంచెత్తడంతో తీరం వెంబడి ఉన్న వేలాది పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడింది. ముంపుబారిన పడి అనేక పశువులు బక్కచిక్కిపోతున్నాయి. 20 రోజులుగా వరద తాకిడికి పశువులను ఏటిగట్లపైన, ఇంటి అరుగులపై కట్టి ఉంచడంతో అవి ఆకలితో అలమటిస్తున్నాయి. బాధితులను ఆదుకోవడంలో విఫలమైన కూటమి పాలనలో మూగజీవాల వేదన అరణ్య రోదనేనని పలువురు విమర్శిస్తున్నారు. పాడి రైతుల కష్టాలను పట్టించుకునే పరిస్థితి ప్రభుత్వంలో లేదనే విమర్శలు వస్తున్నాయి.

కొబ్బరి ఆకులు తిని పొట్ట నింపుకుంటున్న పశువులు

వరదల కారణంగా ప్రస్తుతం నిల్వ ఉంచుకున్న గడ్డి మేట్లు కొన్ని కొట్టుకు పోగా మిగిలివి నీట మునిగాయి. లంక గ్రామాల్లో పుష్కలంగా లభించే పచ్చగడ్డి నెలరోజులుగా ముంపులో ఉండి కుళ్లిపోయింది. మరో రెండు నెలలకు గాని పచ్చగడ్డి అందుబాటులోకి రాదు. దీంతో పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడింది. ఎల్లప్పుడు పచ్చిమేతతో ఉండే లంక గ్రామాల్లోని పశువులు ఆకలికి తట్టుకోలేక పచ్చని కొబ్బరి ఆకులు తిని పొట్ట నింపుకుంటున్న దృశ్యాలు లంక గ్రామాల్లో కంట పడుతున్నాయి.

కష్టాలు మిగిల్చిన వరద

20 రోజులుగా ముంచెత్తిన వరద లంక గ్రామాలకు తీవ్ర నష్టాలనే మిగిల్చింది. గోదావరి వరద ప్రవాహ వేగానికి విలువైన పంట భూములు నదీ కోతకు గురయ్యాయి. వరద కారణంగా వేలాది ఎకరాల్లోని పంటలు ముంపుబారిన పడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని గౌతమీ, వృద్ధ గౌతమీ నదీపాయల మధ్య ఉన్న లంక గ్రామాలు గోదావరి ఆటుపోట్ల మధ్య తల్లడిల్లుతున్నాయి. ఈ ఏడాది నాలుగు సార్లు గోదావరికి వరద పోటెత్తడంతో లంక గ్రామాలు ముంపునకు గురయ్యాయి. పచ్చని పంట పొలాలతో కళకళలాడే వ్యవసాయ భూములు బురదమయంగా తయారయ్యాయి.

లంక గ్రామాల్లో పశుపోషణతో జీవనోపాధి

లంక గ్రామాల్లో పుష్కలంగా లభ్యమయ్యే పశుగ్రాసంతో పశువులను మేపుతూ చాలామంది జీవనోపాధి పొందుతుంటారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని లంకాఫ్ ఠానేల్లంక, కూనాలంక, గురజాపులంక, సలాదివారిపాలెం, కమిని, చింతపల్లి లంక, ఎదుర్లంక, పుగాపులంక కరవాకు లంక వంటి లంక గ్రామాల్లో సుమారు 15 వేల వరకు పశువులు ఉన్నాయి. వరదల కారణంగా పశువుల పాకలు ముంపు బారిన పడటంతో పశువులను ఏటిగట్లపైన వారధి ర్యాంపుల పైన కట్టుకుని కాపాడుకుంటున్నారు. కొన్ని పశువులు ముంపునకు గురై మృత్యువాత పడుతున్నాయి. గత ప్రభుత్వంలో వరదల సమయంలో సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుపోషకులకు దాణా పంపిణీ చేసేవారు. ఈసారి ప్రభుత్వం అటువంటి చర్యలేవీ చేపట్టకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20 రోజులుగా సరైన గ్రాసంలేక పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిందని రైతులు అంటున్నారు. పశువులను ఆదుకునేందుకు పశుసంవర్ధకశాఖ తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నదీ ప్రవాహంతో కోతకు గురవుతున్న లంక భూములు

సలాదివారి పాలెం, శేరిల్లంకలో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలోని వ్యవసాయ భూములు నదీ ప్రవాహానికి కోతకు గురై అండలుగా జారి గోదారిలో కలిసిపోయిందని అధికారులు తాత్కాలిక అంచనాలు వేస్తున్నారు. వరద తగ్గుముఖం పట్టేకొలదీ నదీ కోత ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లంకాఫ్ ఠానేల్లంక, గురజాపు లంక గ్రామాలు వరద నీరు తగ్గి బురదను మిగిల్చింది. ఆయా గ్రామాల్లో కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలైన బొబ్బాయి, నువ్వులు, అరటి, మొక్కజొన్న వంటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరద తగ్గడంతో అధికారులు నష్టాలను అంచనా వేసే పనిలో పడ్డారు. నియోజకవర్గంలో సుమారు 1,800 ఎకరాల్లో కాయగూర, ఆకుకూరల పంటలు, దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటలు దెబ్బ తిన్నాయి



ఐదెకరాల్లో కాయగూర పంటలు వేశాం. సుమారు రూ.25 వేల వరకు పెట్టుబడులు పెట్టాం. వరదలు వచ్చి తోటలు నీట మునిగాయి. ముంపు బారిన పడి పంటలు దెబ్బతిన్నాయి. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాం. ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి

– సలాది సత్యనారాయణ, రైతు. సలాదివారిపాలెం

పశుగ్రాసం కోసం ఇక్కట్లు



వరదలు ముంచెత్తడంతో 20 రోజులుగా లంక గ్రామాల్లో పశుగ్రాసం పూర్తిగా దెబ్బతింది. వరద నీరు పొలాల్లోకి చేరడంతో పశుగ్రాసం ముంపు బారిన పడి కుళ్లిపోయింది. పశుగ్రాసం, సాగు చేసిన పంటలు ముంపు బారిన పడ్డాయి. పశుగ్రాసం లేక పశువులను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎస్. వెంకటేశ్వరరావు, పాడి రైతు, వలసల తిప్ప

క్రీడా పోటీల్లో సత్తా చాటాలి



క్రీడాకారులతో తాతాబాబు తదితరులు

అమలాపురం రూరల్: ఈ నెల 11 నుంచి 12 వరకు బాపట్ల జిల్లా చీరాలలోని జిల్లా క్రీడా మైదానంలో 29వ రాష్ట్రస్థాయి జూనియర్ బాల బాలికల సపక్ తక్రా క్రీడా పోటీలకు అంబేడ్కర్ కోనసీమ జిల్లా జట్టును సిద్ధం చేశామని జిల్లా అధ్యక్షుడు జవ్వాడి తాత బాబు తెలిపారు. ఎంపికైన బాల బాలికలకు ఎస్‌కేబీఆర్ కళాశాలలో కోచ్ యాండ్ర గౌతమ్ ఆధ్వర్యంలో వారం రోజులుగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు, శిక్షణ ముగింపు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జవ్వాది తాత బాబు, చల్లా సత్యనారాయణ మూర్తి, డాక్టర్ల దీక్షితులు గిరిజా కుమారి, ఎస్‌కేబీఆర్ వాకర్ అసోసియేషన్ సభ్యులు క్రీడాకారులను అభినందించి జిల్లా అధ్యక్షుడు సమకూర్చిన నూతన క్రీడా దుస్తులు క్రీడాకారులకు అందజేశారు. బాలుర టీం కోచ్‌గా కేత సతీష్, బాలికల టీమ్ కోచ్‌గా బుల చిరంజీవి, టీం మేనేజర్‌గా జీవీ బాబు వ్యవహరిస్తారని తెలిపారు.

ప్రజా సమస్యలపై ఉద్యమించాలి



పార్టీ సీఈసీ సభ్యులను సత్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీలు, నియోజవర్గ కో ఆర్డినేటర్లు తదితరులు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి
- పార్టీ పదవులు పొందిన నాయకులకు ఘన సత్కారం

అమలాపురం రూరల్: పార్టీ పదవులు పొందిన నాయకులు ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఇటీవల పదవులు పొందిన జిల్లా నాయకులను అమలాపురంలో మాజీ మంత్రి విశ్వరూప్ నివాసంలో శుక్రవారం జగ్గిరెడ్డి అభినందించారు. ఇటీవల పార్టీ సీఈసీ సభ్యులుగా నియమితులైన చింతా అనురాధ, పాముల రాజేశ్వరిదేవి, పితాని బాలకృష్ణ దేవి, పీకే రావు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు నియమితులైన కుడిపూడి వెంకటేశ్వరబాబు, కుడుపూడి భరత్ భూషణ్, సాకా మణికుమారి, నేలపూడి స్టాలిన్ బాబు, కాశీ ముని కుమారి, రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, పాటి శివకుమార్, చింతపాటి శ్రీనివాసరాజు, రాష్ట్ర రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసంశెట్టి తాతాజీని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల రావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, తోట త్రిమూర్తులు, నియోజవర్గ కోఆర్డినేటర్లు గొల్లపల్లి సూర్యారావు, పొన్నాడు వెంకట సతీష్‌కుమార్, డాక్టర్ పినిపే శ్రీకాంత్, పిల్లి సూర్య ప్రకాష్, గన్నవరపు శ్రీనివాసరావు సత్కరించారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై వ్యాపారులకు అవగాహన

అమలాపురం టౌన్: జీఎస్టీ తగ్గింపుతో సేవింగ్స్‌పై పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన వ్యాపార సంఘాల ప్రతినిధులకు మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ శుక్రవారం అవగాహన కల్పించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బ్రోచర్ ఆవిష్కరణ

కాట్రేనికోన: జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఎం.జగన్ మోహన్‌రెడ్డి, అధికారులు శుక్రవారం కాట్రేనికోనలో శుక్రవారం జీఎస్టీ తగ్గింపుపై సదస్సు నిర్వహించారు. వ్యాపారులతో కలిసి అధికారులు జీఎస్టీ తగ్గింపు బ్రోచర్‌ను ప్రదర్శించారు.

మోటార్ సైకిల్ దగ్ధం

అమలాపురం రూరల్: కామనగరువు పరిధి చల్లపల్లి రోడ్డులో రెడ్డిపల్లి తూము సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం మోటార్ సైకిల్ దగ్ధమైంది. ఓ వ్యక్తికి చెందిన మోటార్ సైకిల్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పెట్రోల్ బంక్ సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. స్థానికులు, పెట్రోలు కోసం వచ్చిన వాహనాదారులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థి స్థాయికి అనుగుణంగా బోధించాలి

అల్లవరం: ఉపాధ్యాయులు బోధన చేసే సమయంలో విద్యార్థి స్థాయిని దృష్టిలో ఉంచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా, సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీ పిలుపునిచ్చారు. అల్లవరం మండలం ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో డీఎస్సీ 2025 ఉపాధ్యాయుల ఇండక్షన్ శిక్షణ ముగింపు సమావేశం శుక్రవారం నిర్వహించారు. కోర్సు డైరెక్టర్ పి.పల్లయ్యశర్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీఈవో సలీం బాషా మాట్లాడుతూ పాఠశాలలో తరగతి లక్ష్యాలకు అనుగుణంగా వెనుకబడిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఆసక్తికర బోధన చేయాలన్నారు. సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ 244 మంది ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామన్నారు. 10 మంది ఎస్ఆర్‌పీలు గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన బోధనా మెళకువలను తెలియజేశారన్నారు. ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశరావు, సమగ్ర శిక్షా ఏపీలో, జీసీడీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, జిల్లా సైన్స్ అధికారులు జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎం.శ్రీనివాస వినీల్, జీఏ వీఎస్ నెహ్రూ, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, వైవీవీ సత్యనారాయణ, చోడిశెట్టి ఆంజనేయులు, హెచ్ఎం బీహెచ్.రామకష్ణ మాట్లాడారు. గణితం, సైన్స్ సబ్జెక్టు నిపుణులు పీవీఎల్ఎన్‌శ్రీరామ్, బెహరా సత్యనారాయణమూర్తి, అంగాని గోపాలకష్ణ తదితరులు ఆయా పాఠ్యాంశాలకు సంబంధించిన అంశాలు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులకు శిక్షణ నైపుణ్య సర్టిఫికెట్లు అందజేశారు.

కొనసాగుతున్న న్యాయవాదుల నిరసన



ముమ్మిడివరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు



అమలాపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

ముమ్మిడివరం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయిపై న్యాయవాది కిశోర్ రాకేష్ దాడికి ప్రయత్నించడాన్ని నిరశిస్తూ ముమ్మిడివరం బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన నిరసన కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. కోర్టు భవనం ఎదుట బార్ ప్రెసిడెంట్ వడ్డినాగేశ్వరరావు ఆధ్వర్యంలో రిలే దీక్ష చేపట్టి నిరసన తెలిపారు. దాడి వెనుక ఉన్న కుట్రకోణాన్ని దర్యాప్తు ద్వారా ప్రభుత్వం వెలికితీయాలని మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తటవర్తి నాగరాజారావు డిమాండ్ చేశారు. ప్రధాన న్యాయమూర్తిపై దాడిని రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై, న్యాయవాదుల పైన దాడిగా భావించి తీవ్రంగా గర్హిస్తున్నామని దీనిపై మాజీ న్యామూర్తులతో కూడిన రాజ్యాంగ సమీక్ష కమిటీ న్యాయవ్యవస్థ సమీక్ష కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని బార్ అసోషియేషన్ డిమాండ్ చేసింది. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ టి.సుభాష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, పీవీ చక్రవర్తి, కాశి సింహాద్రి, బీర ప్రసాద్‌బాబు, దోనిపాటి ఆంజనేయులు, ఎంటీ ప్రసాద్, ముడే వెంకట్రావు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేత

అమలాపురం టౌన్: సుప్రీం కోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ అమలాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు స్థానిక కోర్టు భవనాల ప్రాంగణంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం కొనసాగాయి. అనంతరం న్యాయవాదులు కోర్టు భవనాల నుంచి బైక్ ర్యాలీగా గడియారం స్తంభం సెంటరు, బుద్ధ విహార్‌కు వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. బుద్ధ విహార్ వ్యవస్థాపకుడు, రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీసీ కోఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు న్యాయవాదులు ఆందోళనకు మద్దతు తెలిపారు. అనంతరం న్యాయవాదులు కలెక్టరేట్‌కు వెళ్లి దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందించారు. కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు నిర్వహించిన రిలే నిరాహార దీక్షకు రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవిల్లి గోపాలరావు, ముమ్మిడివరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు సంఘీభావం తెలిపారు. రిలే దీక్షలో అమలాపురం సీనియర్ న్యాయవాదులు డీబీ లోక్, ఎండీ ఆజామ్, పెయ్యల శ్రీనివాసరావు, కుడుపూడి త్రినాథ్. మాకిరెడ్డి ఆదినారాయణ పాల్గొన్నారు.బార్ అసోసియేషన్ ప్రతినిధులు చింతపల్లి అజయ్‌కుమార్, కూచిమంచి శిశిధర్ శ్రీరామ్. బడుగు జోగేష్, మట్టా వెంకట్రావు తదితరులు పర్యవేక్షించారు. శుక్రవారంతో రిలే నిరాహార దీక్షలను ముగిస్తున్నట్లు న్యాయవాది అజయ్‌కుమార్ తెలిపారు.

చెడీ తాలింఖానా గురువుకు సత్కారం



తాలింఖానా గురువు మల్లేష్‌ను సత్కరించి అభినందిస్తున్న పూర్వ విద్యార్థులు

అమలాపురం టౌన్: ఉద్యోగ రీత్యా అమెరికా దేశంలో ఉంటూ ప్రతి దసరా ఊరేగింపునకు అమలాపురం వస్తున్న స్థానిక మహిపాల వీధికి చెందిన అబ్బిరెడ్డి రామదాసు కుటుంబం నాలుగో తరం చెడీ తాలింఖానా గురువు అబ్బిరెడ్డి మల్లేష్‌ను పూర్వపు విద్యార్థులు ఘనంగా సత్కరించారు. స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్లో 2002–23 పదో తరగతి చదివిన మల్లేష్‌ను స్నేహితులు, పూర్వ విద్యార్థులు స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం సత్కరించి, అభినందించారు. అమలాపురం నుంచి అమెరికా వెళుతున్న మల్లేష్‌కు వారంతా ఘనంగా వీడ్కోలు పలికారు. మల్లేష్ స్నేహితులు, పూర్వపు విద్యార్థులు పిండి రాజా, ఆసు భరత్ రామ్, కల్వకొలను ఉమ, లక్కోజు తులసీరామ్, పుప్పాల రామ్ తదితరులు మల్లేష్‌ను సత్కరించారు. చెడీ తాలింఖానా ప్రదర్శనలో మల్లేష్ పాల్గొన్న చిత్రంతో కూడిన జ్ఞాపికను వారు తమ మిత్రుడికి అందించారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ పురోగమించాలి



బాలికలకు 2కే రన్‌ను ప్రారంభిస్తున్న మల్లాడి తదితరులు

యానాం: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ పురోగమించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం మహిళా, శిశు అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో మిషన్‌శక్తి హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్– బేటీ బచావో బేటీ పడావో ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికాదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన 2కే పరుగుపందెంను ఆయన ప్రారంభించారు. అనంతరం 2కే రన్‌లో విజేతలకు రీజినల్ అడ్మినిస్ట్రేటర్ అంకిత్‌కుమార్‌తో కలిసి ఆయన బహుమతులు అందజేశారు. ఈ పరుగు పందెంలో వంద మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రితిక, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



సీబీవీ పాలెంలో మండలస్థాయి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న బొడ్డు సత్యనారాయణ

తాళ్లరేవు: విద్యార్థినీ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును అందుకోవచ్చని సీబీవీ పాలెం స్కూల్ ఫౌండర్ బొడ్డు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం కోరంగి పంచాయతీ సీబీవీ పాలెం హైస్కూల్లో మండల స్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. స్కూల్ గెజిటెడ్ హెచ్ఎం కేఆర్‌కే సాయిప్రసాద్ మాట్లాడుతూ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు డివిజన్ స్థాయికి అనంతరం జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపికవుతారని తెలిపారు. పోటీల కన్వీనర్ ఎం.నాగేంద్ర పర్యవేక్షణలో పీడీలు చంద్రావతి, తంబీ, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, కరుణ తదితరుల పర్యవేక్షణలో యోగా, చెస్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడాపోటీలు నిర్వహించారు. ఎంఈఓ -2 మోకా ఉమ, స్కూల్ కమిటీ చైర్మన్ కొపనాతి దత్తాత్రేయ వర్మ, ఉపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, వాకపల్లి అప్పారావు, పి.త్రిమూర్తులు, జీకే శేఖర్, సీహెచ్ రమేష్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

అమలాపురం టౌన్: బండారులంక శివారు శ్రీరామ్ నగర్‌కు చెందిన చేట్ల రామమోహనరావు కిడ్నీ సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబానికి చెందిన రామమోహనరావు వైద్య ఖర్చుల కోసం గుడ్ సీడ్ ఫౌండేషన్ రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని సమకూర్చింది. అమలాపురంలోని ఫౌండేషన్ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు, ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ కుంచే వెంకటరమణారావు రూ.10 వేల చెక్‌ను కిడ్నీ బాధితుడి తల్లికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, పార్టీ నాయకులు పందిరి సుబ్బరాజు, నేరేడుమిల్లి శ్రీను, నేలపూడి సుగంధకుమార్, దంగేటి సుబ్బు పాల్గొన్నారు.

బాణసంచా సీజ్

అమలాపురం టౌన్: పేరూరులోని ఓ కిరాణా దుకాణంలో అనధికారికంగా బాణసంచా నిల్వ ఉంచారన్న అభియోగంపై పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. రూ. 10 వేల విలువైన బాణసంచా సామగ్రిని సీజ్ చేసినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. అనధికారికంగా బాణసంచా కలిగిన కిరాణా దుకాణం యాజమాని శీలం శివన్నారాయణను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కిరాణా దుకాణంలో బాణసంచా సామగ్రిని పట్టణ ఎస్సై ఎన్ఆర్ కిషోర్‌బాబు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రశాంత జీవనంతో సంపూర్ణ ఆరోగ్యం



రిలయన్స్ దివ్యాంగుల కేంద్రంలో మాట్లాడుతున్న శ్రీకాంత్



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

తాళ్లరేవు: నిరంతరం సంతోషంగా ఉండడం, ఎక్కడి విషయాన్ని అక్కడే వదిలివేయడం వంటి చర్యలతో ఒత్తిడి లేకుండా ప్రశాంత జీవనం సాగిస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం సీతారామపురంలోని ధీరూబాయి అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్‌లో ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల న్యాయ సేవాధికార సంస్థ రిటైనర్ వై.వసంత, ప్యానెల్ న్యాయవాది శ్రీపాద రాజశేఖర్ తదితరులు హాజరై దివ్యాంగ పిల్లలకు, వారి తల్లులకు మానసిక ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం సెంటర్ ఫిజియోథెరపిస్ట్‌లు ఆరోగ్యానికి సంబంధించి పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జ్ ఎంవీ గోపాలరావు, ప్రతినిధులు ఉదయకుమారి, సత్తిబాబు, స్టీఫెన్ పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ఐ.పోలవరం: బాలికలు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతోందని పలువురు వక్తలన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరం సీడీపీవో ఆధ్వర్యంలో మురమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. సీడీపీవో ఎం.హారిక ఆధ్వర్యంలో బాలబాలికలు పలు పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వ్యక్తృత్వం, పెయింటింగ్ వంటి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతల కు మునగాకు పొడితో తయారు చేసిన హార్లిక్స్ ప్యాకెట్లు, బిసెట్లు, మునగ మొక్కలు అందించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, మురమళ్ల సర్పంచ్ రాయపురెడ్డి మాణిక్యాలరావు, పాఠశాల కమిటీ చైర్మన్ విత్తనాల సత్యమూర్తి, హెచ్ఎం సుజా త, ఏలూరి మూర్తి, ప్రథమ్ సంస్థకు చెందిన సత్యనారాయణ, పి. నాగలక్ష్మి, జె.మీనాక్షి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

అమలాపురం టౌన్: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది మానసిక ఆరోగ్యంపై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఎన్‌సీడీ పీవో డాక్టర్ సుమలత, ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.శంకరరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ కార్తీక్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మానసిక ఆరోగ్య సమస్యల వల్ల కలిగే అనర్థాలను వైద్యులు వివరించారు. ఆస్పత్రి సైకియాట్రిస్ట్ డాక్టర్ సౌమ్య, సైకో సోషల్ వర్కర్ బాబి, డి– అడిక్షన్ సెంటర్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనుబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వలవల శివరావు, ఆవుపాటి గోపాల్‌తోపాటు డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ బృందం, వైద్య సిబ్బంది, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

ఒత్తిడి, ఆందోళనతో మానసిక రుగ్మతలు

యానాం: మారుతున్న ఆధునిక సమాజంతోపాటు మనిషి జీవనశైలి కారణంగా ఒత్తిడి, ఆందోళన వలన పలువురు మానసిక రుగ్మతల బారిన పడుతున్నారని డాక్టర్ విజయదుర్గ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బీచ్‌రోడ్డులోని ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగుల పాఠశాలలో వరల్డ్ మెంటల్ హెల్త్‌డే సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెంటర్ ప్రిన్సిపల్ కె.శ్రీనివాస్, ప్రత్యేక టీచర్లు కె.మహేశ్వరీ, వీరవేణి, తాతారావు, దుర్గ పాల్గొన్నారు.